

# రెప్పల మీద నీడలు

## – అత్తలూరి విజయలక్ష్మి



(గత సంచిక తరువాయి)

## – 10 –

**శివరామకృష్ణ క్లినిక్ గేటులో** మొదటిసారి తనంతట తనుగా అడుగుపెట్టింది పవిత్ర.

ఇప్పటివరకు రెండు, మూడుసార్లు అతని తోటే వచ్చింది. కాలేజ్ వదిలే సమయానికి టంచనుగా అతను కారు తీసుకుని రావడం, ఆమెని ఎక్కించుకుని క్లినిక్ కి తీసుకు రావడం జరిగింది. రెండు రోజుల నుంచి అతను పనిచేసే హాస్పిటల్ లో ఎమర్జెన్సీ కేసులు ఉన్నాయని రాలేదు. మధ్యాహ్నం వాచ్ మాన్ వచ్చి సాయంత్రం తనని క్లినిక్ రమ్మన్నాడని చెప్పిన దగ్గరనుంచీ ఆమె గుండె దడదడలాడుతోంది. ఎప్పుడెప్పుడు ఆరవుతుందా అని ఎదురుచూస్తోంది.

ఒకసారి ఇంటికి వెళ్ళాక బయటకి ఒంటరిగా రావడం ఇప్పటివరకు జరగలేదు. అదికూడా సాయంత్రం దీపాలు పెట్టేవేళ అసలే పంపించదు వర్ధని. ఆవిడని ఒప్పించడం ఎలాగా అని చాలా రకాల ప్రణాళికలు ఆలోచించింది పవిత్ర. చివరికి నాంచారమ్మ దయతో సులువుగా బయట పడింది.

క్లినిక్ తలుపు తెరిచే ఉంది. వాచ్ మాన్ పరిగెత్తుకుని వచ్చి, “రండమ్మా” అంటూ ఆహ్వానించి, లోపలికి తీసుకుని వెళ్ళాడు.

నిశ్శబ్దంగా ఉంది అంతటా. “డాక్టర్ గారు లేరా?” కొంచెం భయంగా అడిగింది.

“ఉన్నారమ్మా. ఇప్పుడే వచ్చారు. బాత్ రూమ్ లో ఉన్నారు వస్తారు మీరు కూర్చోండి” సోఫా చూపించాడు.

పవిత్ర అదురుతున్న గుండెలు చిక్కబట్టుకుని సోఫా అంచున కూర్చుంది.

వాచ్ మాన్ బయటకు వెళ్ళిపోయాడు.

శివతో వచ్చినపుడు పరిసరాల స్పృహ లేదు. అతని అల్లరి చేష్టలు, కొంటె మాటలు మైకంలో ముంచేస్తుంటే తనని తాను మర్చిపోయి, అతని మోహంలో ఉండిపోయేది. ఇప్పుడు ఒక్కతీ కూర్చుని పరిసరాలు నింపాదిగా, పరిశీలనగా చూసింది.

గేటు లో నుంచి రాగానే ఎడమ పక్క కొన్ని పూల మొక్కలు, కుడి పక్క నాలుగు మెట్లు, మెట్లు ఎక్కగానే చిన్న పోర్టికో, కుడివైపు ఒక గది, ఆ గది బయట గోడకి డాక్టర్ శివరామకృష్ణ ఎం.బి.బి.ఎస్ అని నేమ్ ప్లేట్ ఉంది. ఆమె కూర్చున్న హాలు కుడిపక్క ఉంది. లోపల గది కనిపించకుండా కర్టెన్ వ్రేళ్ళాడుతోంది. ఎడం పక్క క్లినిక్ కాబోలు. ఇంతవరకు ఒక్క పేషంట్ కూడా కనిపించలేదు.

ఆమె ఆలోచనలు భగ్నం చేస్తూ "హాయ్ డార్లింగ్ వచ్చేసావా?" అంటూ కర్టెన్ తొలగించుకుని వచ్చాడు శివ.

తెల్లని లాల్చీ, పైజామాలో స్ఫురద్రూపంతో, షాంపూ చేసిన క్రాఫ్ అల్లరి,చిల్లరిగా నుదుట మీద పడుతుంటే నవమన్మధుడిలా వచ్చిన అతన్ని చూడగానే పవిత్ర గుండె ఝల్లుమంది. అప్పటివరకు అజాపజా లేని సిగ్గు అమాంతం ఆమెని ఆక్రమించుకుంది. సిగ్గుపడుతూ గబుక్కున లేచి నిలబడింది.

" అబ్బ సిగ్గుతో కందిన నీ మొహం ఇప్పుడే విచ్చుకున్న ఎర్ర మందారంలా ఎంత బాగుందో!" అన్నాడు.

ఆమె మొహం మరింతగా రక్తం చివ్వుమని ఎగసినట్టు మరింత ఎర్రగా మారింది.

ఆమెకి బాగా దగ్గరగా వచ్చి, నుదుటి మీద, చెంపల మీద పడిన ముంగురులు సవరిస్తూ,"ఈ ముంగురులు పూవు మధ్యలో ఫిలమెంట్ చెదిరి నీ చెంపలతో ఆడుకుంటున్నట్టుంది... పుప్పొడి నీ శరీరం అంతా సువాసనలు పూసింది కాబోలు... ఎంత అందంగా పరిమళిస్తున్నావు? ఈ అందం అంతా నాకోసమే కదూ!" మెత్తగా, మృదుమధురంగా చెవిలో గుసగుసగా వినిపిస్తున్న ఆ స్వరం, అతని వెచ్చని ఊపిరి నిజంగానే ప్రకృతిలోని పూలన్నీ రాల్చిన పుప్పొడిలా మత్తెక్కిస్తుంటే రెండు చేతులతో మొహం కప్పుకుంది.

రెండు చేతులు ఆమె మెడ మీదుగా దండలా చుట్టేసి, సున్నితంగా ఆమె మొహం దాచుకున్న ఆ చేతులు తప్పించి, గుప్పిట్లో పట్టుకుని "పున్నమి చంద్రుదుని మబ్బులు కప్పేస్తే ఊరుకుంటానా? మబ్బులని మడతేసి ఇలా నా గుప్పిట్లో బంధిస్తా, వెన్నెలని ఆస్వాదిస్తా." అన్నాడు పెదవులతో ఆమె నుదుటి మీద ఉన్న ముంగురులు తప్పిస్తూ.

ఒక్కసారి ఒళ్లంతా తమకంతో వణికిపోతుంటే విరబూసిన పూలకోమ్మలా అతని మీద వాలిపోయింది. సీతాకోక చిలుక ఒకటి వయ్యారంగా ఎగురుతూ వచ్చి రెక్కలతో తనువంతా తడుముతున్నట్టు, అతని పెదవులు ఆమె నుదుటి మీద నుంచి జారి, ముక్కు మీదుగా, చెంపలని చుంబించి, పెదవుల దగ్గర స్థిరపడ్డాయి.

ఆమె వద్దనలేదు... ఆ తీయదనం ఆస్వాదిస్తూ కూయడం మర్చిపోయిన కోయిలలా నిశ్శబ్దంగా ఉండిపోయింది.

అతని పెదవులు కొన్ని క్షణాలపాటు అమృతం గ్రోలుతున్నట్టు అక్కడక్కడే తారాడి, నెమ్మదిగా ఆమె చెవిలో రహస్యం చెప్పాయి. "లోపలికి వెళదామా?"

ఆమె ఒక్కసారిగా త్రుళ్ళిపడి అతని నుంచి విడివడుతూ “నాకు భయంగా ఉంది” అంది.

“ఎందుకు భయం? నా కౌగిలి నిన్ను భద్రంగా కాపాడుతూ ఉంటుంది” అంటూ దగ్గరగా లాక్కుని బిగి కౌగిలిలో బంధించాడు.

అతని కౌగిట్లో గువ్వలా ఒదిగిపోతూనే అంది. “ఒద్దు. వెళ్ళిపోతాను.”

“ఎక్కడికి వెళ్తావు నా బంగారూ. నేను వదులుతాననే... ఎప్పటికీ వదలను. ఇక్కడ ఈ హృదయంలో నీకెప్పుడో తాజ్ మహల్ కట్టేసాను. నువ్వు ఇంక ఇక్కడే. ఎక్కడికీ వెళ్ళవు. వెళ్ళకూడదు.”

“తాజ్ మహల్ సమాధి కదా” పెదవులు బిగబట్టి నవ్వాపుకుంటూ అంది.

“అమ్మో ఏమో అనుకున్నాను. మాటకారివే. సమాధి కాదు. ప్రేమ మందిరం. నీకోసం నేను నా హృదయంలో కట్టుకున్న అందమైన ప్రేమ మందిరం.”

“అయితే, పెళ్ళయ్యాక అక్కడేనా మన కాపురం?”

“అల్లరి పిల్లా. ఇంత చిలిపిదనం ఎక్కడ దాచావు?” మరోసారి చెంపలు చుంబిస్తూ అన్నాడు.

“ఎక్కడో దాచాను. రహస్యం” అంది కవ్విస్తున్నట్టు.

“అలాగా. నేనా రహస్యం తెలుసుకుంటాను. నాకేమిస్తావు?”

అతని కళ్ళల్లో కనిపిస్తున్న కాంక్ష చూసి, మొహం పక్కకి తిప్పుకుని “చాకొలేట్” అంది.

గట్టిగా నవ్వి మరింత గట్టిగా బంధించి అన్నాడు. “ఈ మహాపట్నంలో మనం రోజూ ఏకాంతంగా కలుసుకోడానికి ఒక మంచి స్థలం చూసాను అక్కడికి వెళదామా?”

“ఇప్పుడా? ఇంటికి వెళ్ళిపోవాలి. ఆలస్యం అయితే అమ్మ, నానమ్మ కంగారు పడతారు. నాన్నగారు కూడా ఇంటికి వచ్చేస్తారు. రేపు వెళదాము.?

“సరే. రేపు యధాప్రకారం మీ కాలేజ్ దగ్గరకు వస్తాను రెడీ గా ఉండు.”

“మీరలా రోజూ వస్తే మా ఫ్రెండ్స్ ఆట పట్టిస్తున్నారు. పైగా అందరూ చూస్తున్నారు. ఎవరన్నా నాన్నకి చెబితే”

“ఎవరో ఎందుకు నేనే చెప్తాను. ఒక్క ఆరు నెలలు సమయం ఇవ్వండి మీ అమ్మాయి మెడలో మూడుముళ్ళు వేసేస్తాను అప్పటి వరకు మేము మూడు ముద్దులు, ఆరు కౌగిళ్ళ తో ఆనందిస్తాము... మమ్మల్ని ఆపద్దు అని.”

వెన్నెల జలపాతం నుంచి మెత్తగా జారుతున్నట్టు అనిపించింది.

పెళ్లి... ఎంత బాగుంది ఈ మాట. ఆరునెలల్లో ఈ నవమన్మధుడి భార్య అవుతుందా? ఇతని ఇంట్లో ఇతనితో జీవితాంతం ఈ స్వర్గసుఖాలు అనుభవిస్తూ జీవిస్తుందా? నిజమా? ఇది నిజమా? కిటికీ లో నుంచి చల్లగా వీస్తున్న గాలి తెరలను అడిగింది. బయట కనిపిస్తున్న నిత్యమల్లె పూలను అడిగింది... కదులుతున్న పరదాని అడిగింది. నిజం, నిజం అక్షరాలా నిజం అంటూ చెవిలో గుసగుసగా చెప్పి పారిపోయాయి అన్నీ.

"ఇప్పటివరకు ఈ హాల్లోనే మన సరసాలు సాగాయి. నా ఇల్లు చూడవా?" అడిగాడు.

"ఇది మీ ఇల్లా? క్లినిక్ అన్నారుగా " ఆశ్చర్యంగా చూసింది.

"ఇల్లు, క్లినిక్ ఇదే. రా చూపిస్తా" ఆమె చేయి పట్టుకుని, గుమ్మం దగ్గరకు తీసుకుని వెళ్లి, ఎదురుగా ఉన్న మూసి ఉన్న తలుపు చూపిస్తూ "అది నా క్లినిక్. గోడకి నేమ్ ప్లేట్ ఉంది చూసావా?"

ఆమె తల ఊపింది. పొడుగాటి వరండాలో ఉన్న ఇనప కుర్చీలు చూపిస్తూ "పేషంట్స్ అక్కడ కూర్చుంటారు." అన్నాడు.

"నేను ఎప్పుడూ ఎవరినీ చూడలేదే" సందేహంగా అంది.

"నువ్వు వచ్చినపుడు క్లినిక్ ఓపెన్ చేయను. మనకి ఏకాంతం కావాలి కదా!"

"ఓ!" సిగ్గుపడుతూ నవ్వింది

"ఇప్పుడు ఇల్లు చూద్దువు గాని" అంటూ వెనక్కి తిరిగి, కర్టెన్ జరిపి లోపలికి తీసుకుని వెళ్ళాడు.

విశాలంగా ఉన్న గది, ఖరీదైన సోఫా సెట్, మధ్యలో గాజు టీ పాయ్, ఒక మూల పొడుగాటి వేజ్, అందులో అందమైన ప్లాస్టిక్ పూల గుత్తులు, గోడకి టి వి. చాలా అందంగా ఉంది.

"ఇక్కడ ఎవరుంటారు?" విశాలమైన కళ్ళు మరింత విశాలం చేస్తూ అడిగింది.

"ప్రస్తుతం నేను, ఆరునెల్ల తరవాత మనం"

"మీ అమ్మా, నాన్నా, అక్కలు, చెల్లెళ్ళు..."

"నాకు అమ్మా, నాన్నా లేరు. మా పిన్ని పెంచింది. పిన్ని హైదరాబాద్ లో ఉంటుంది. బాబాయ్ అక్కడ డాక్టర్. వాళ్లకి ఇద్దరు అమ్మాయిలు. వాళ్ళే నా కుటుంబం..." ఆమె మాటలు మధ్యలో ఆపుతూ అన్నాడు.

"అయ్యో ఎలా పోయారు మీ అమ్మ,నాన్నా" సానుభూతిగా అడిగింది.

"అనారోగ్యం." అంతకన్నా చెప్పడం ఇష్టం లేనట్టు ముక్తసరిగా చెప్పి, "రా బెడ్ రూమ్ చూపిస్తాను" అంటూ కుడివైపు ఉన్న గదిలోకి తీసుకుని వెళ్ళాడు.

డబల్ కాట్, మెత్తటి ఫోం బెడ్, తెల్లటి బెడ్ షీట్, తెల్లటి దుప్పట్లు, తెల్లటి గలీబులతో ఉన్న తలగడాలు... ఏ.సి రూమ్ చల్లగా ఉంది. ఏదో మత్తైన పరిమళం వ్యాపించి ఉంది.

బొమ్మలా నిలబడిపోయిన ఆమె భుజం మీద చేయేసి, "ఈ బెడ్ నీకోసం ఎదురుచూస్తోంది" అన్నాడు మత్తుగా.

ఆమె కళ్ళల్లోకి కాంతి కిరణాలు దూసుకువచ్చాయి. బరువుగా వాలిపోతున్న కనురెప్పల చివర నుంచి అతని పాదాల వైపు చూస్తూ "ఆరునెల్ల తరవాత వస్తాను అని చెప్పండి" అంది.

"అన్యాయం. ఈలోగా ఎంత బెంగ పెట్టుకుంటుందో తెలుసా? కొంచెం కరుణించకూడదూ!" భుజాల మీద చేతులు బలంగా నొక్కుతూ అన్నాడు.

పవిత్రకి భయంతో వణుకు వచ్చింది. ఒక్కసారి తల్లి,తండ్రులు నానమ్మ కళ్ళ ముందు కదిలారు. పులకిస్తూ, పరవశిస్తూ పరితపిస్తున్న మనసుని అతి ప్రయత్నం మీద అదుపు చేసుకుంటూ గబుక్కున అతన్ని విడిపించుకుని గది బయటకు పరిగెత్తింది.

"ఏయ్ నేనేం చేయను. ఎందుకంత భయం?" ఆమె వెనకాలే వెళ్తూ అన్నాడు.

వణుకుతున్న స్వరంతో అంది" రోజూ నేను మీ దగ్గరకి రావడమే ఎంతో మంది చూసి ఉంటారు. ఈ చిన్న ఊళ్ళో ఎవరు చూసారో అమ్మకో, నాన్నకో తెలిసేదాకా నాకూ తెలియదు. మీ వాచ్మాన్ ఎవరికన్నా నేను ఇక్కడికి వస్తున్నట్టు చెప్పాడంటే ఇంక నన్ను ఇంట్లో కట్టేస్తారుకూడా."

"అందుకే ఇక్కడికి రానవసరం లేకుండా మంచి రహస్య ప్రదేశం కనిపెట్టాను అని చెప్పాగా" మృదువుగా అన్నాడు.

"అలా అయితే అక్కడే కలుద్దాం రేపు. నేను వెళ్ళిపోతాను " అంది.

అప్పటికే భయంతో ఆమె అరిచేతులు చల్లగా అయినాయి. చెవి దగ్గర, నుదుటి మీద చిరుచెమట్లు పట్టాయి. అది చూసి ప్రేమగా అన్నాడు. "అంత భయపడుకు పవిత్రా. నిన్ను ఏమి చేయను పెళ్లి అయిందాకా. శాస్త్ర బద్ధంగా నిన్ను నా దాన్ని కేవలం నా దానిగా చేసుకుని అప్పుడు, అప్పుడు" ఆమె మీదకి కొద్దిగా ఒంగి అన్నాడు "ఈ పూవులోని మకరందం గ్రోలుతాను. సరేనా"

ఆమె మాట్లాడలేదు. అతని మొహంలోకి చూసి మధురంగా నవ్వింది. "ఇంక వెళ్ళనా?"

"డ్రాప్ చేస్తాగా"

"ఒద్దు. అలా కారులో తిరగడం కూడా బాగుండదు. ఎవరన్నా చూస్తారు. ఆ మోహన్ గాడు నా వెనకాలే వచ్చాడు ఇందాక వాడు కచ్చితంగా నేను మీ కారులో ఎక్కడం చూసే ఉంటాడు ఎప్పుడో. మా నానమ్మకి చెప్పాడంటే అంతే"

"మోహన్ ఎవరు?"

"మా పక్కింట్లో ఉంటారు. ఆరోజు నానమ్మ పడిపోయిన రోజు తనే మిమ్మల్ని మా ఇంటికి తీసుకుని వచ్చాడు కదా"

"ఓ పొట్టిగా, నల్లగా ఉన్నాడు. అతనా?"

"అవును. ఆ కాకి నన్ను ప్రేమిస్తున్నాట్ట. నేను ఎక్కడికి వెళ్ళినా బాడి గార్డు లాగా తోడు రానా అంటూ నా వెంట పడతాడు. ఇవాళ తిట్టి పంపించాను వెదవని" కసిగా అంది.

కొన్ని క్షణాలు శివ మాట్లాడలేదు. తరవాత నెమ్మదిగా అన్నాడు. "వాడి సంగతి నేను చూసుకుంటాలే. నువ్వు వెళ్ళిపో. రేపు కలుద్దాం" అన్నాడు ఆమెని దగ్గరకు లాక్కుని ముద్దుపెట్టుకుని వదిలేస్తూ.

ఆమె మనోహరంగా నవ్వి, బయటకు నడిచి, లేడి పిల్లలా చెంగు చెంగున మూడు మెట్లు దిగి గేటు దాటింది.

సంధ్య జరీపూల నల్లని సిల్కు పరదాలు వేసుకుంది. అక్కడక్కడా ఇద్దరిద్దరు చొప్పున జనం కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు. పొగడపూల సువాసన దారి నిండా పరచుకుంది. తనువంతా తేనెలో స్నానం చేసినట్టు తీయగా జలదరిస్తుంటే, మధురమైన ఊహలతో, అడుగులో అడుగు వేస్తూ, గాలిలో తేలుతున్నట్టుగా నడుస్తోంది పవిత్ర.

పొడుగాటి నీడ ఒకటి పొగడ చెట్టు వెనక నుంచి కదిలింది. నీడలెప్పుడూ కొలవలేనంత పొడుగ్గానే ఉంటాయి. ఎందుకంటే ఎప్పటికి చేతికి దొరకవు.

పవిత్ర భయపడినట్టుగానే ఆ చిన్న ఊరిలో వీళ్ళ ప్రేమ పరిమళాలు వ్యాపించడానికి ఎక్కువ రోజులు పట్టలేదు.

మోహన్ కి మనసు, మనసులో లేదు. తనది అనుకుంటున్న పవిత్ర శివకి దగ్గరవుతోందా? రెండు, మూడుసార్లు కాలేజి గేటు దగ్గర అతని కారులో ఎక్కడం చూసినా, నాంచారమ్మగారిని చూడడానికి వెళ్తూ దారే కాబట్టి ఆమెని తీసుకుని వెళ్తున్నాడు అనుకున్నాడు. తనంటే పవిత్రకి ఇష్టం లేదు కాబట్టి, డాక్టర్ గారిని స్వయంగా తనే తీసుకుని వెళ్తోంది అనుకున్నాడు. కానీ, అతని మనసులో వాళ్ళిద్దరి మధ్యా ఒక ఆకర్షణ ఏర్పడుతుందేమో అనే ఆలోచనే రాలేదు.

చీకటి పడుతుండగా పవిత్ర ఒంటరిగా ఎక్కడికో వెళ్తోంది, తను ఆమెకి రక్షణగా వెళ్తున్నాను అని ఆమె తిరస్కరించినా, కోప్పడినా ఆమెని రహస్యంగా వెంబడించాడు. రహస్యం బద్దలయింది. ఆమె ఎక్కడికి వెళ్ళిందో గమనించాక, అక్కడ ఏం జరుగుతుందో అన్న ఆసక్తితో తనూ ఆ గేటులోకి అడుగుపెట్టి, వెనక వైపు వెళ్లి నిలబడ్డాడు. మాటలు వినిపించాయి, ఆ మాటల్లో వాళ్ళిద్దరూ పెళ్లి చేసుకోవాలనుకుంటున్న తీర్మానం విన్నాడు. వాళ్ళని చూడడానికి మార్గం కనిపించలేదు. పవిత్ర కంగారుగా వద్దు, నేను వెళ్లిపోవాలి అన్న మాటలు విని, గబుక్కున బయటకు వచ్చి చెట్టు చాటున నిలబడ్డాడు.

ఆమె అడుగులు మధురమైన ఊహలతో తడబడుతుంటే, అతని అడుగులు తీవ్రమైన ఆవేశంతో, ఆవేదనతో తడబడుతుండగా ఇంటికి వచ్చాడు. నేరుగా డాబా మీదకు వెళ్లి తనలో కలుగుతున్న భావోద్వేగం అణచుకోడానికి విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు. కానీ చేత కావడంలేదు. కాళ్ళు, చేతులు వణికిపోతున్నాయి. హృదయం మీద నిప్పుల వర్షం పడుతున్నట్టు ఉంది. కాసేపు తల రెండు చేతులతో పట్టుకుని కింద కూలబడ్డాడు. కాసేపు అలాగే గచ్చు మీద వెల్లకిలా పడుకుని ఆకాశంలోకి చూస్తూ ఆవేదనగా అరిచాడు “ఓ దేవుడా ఇది నిజమేనా?నాకు అన్యాయం చేస్తావా ?”

అయితే దేవుడిని ఆ ప్రశ్న వేసే ముందు పవిత్ర, శివాల జంటని కళ్ళముందు నిలుపుకుని, పక్కన తనని తాను అంతర్నేత్రం తో చూసుకుని ఉంటే అతనిలో ఆవేశం, ఆవేదన స్థానంలో ఆలోచన ఉండేది. కానీ ఆలోచించే విధంగా వివేకం పని చేయడం లేదు. బోర్లా పడుకుని వెక్కి, వెక్కి ఏడ్చాడు.

పవిత్రని, తనది అనుకుంటున్న పవిత్రని ఆ శివ కోసం త్యాగం చేయాలా? లేదు చేయలేదు. ఏమైనా సరే పవిత్ర కావాలి. ఆమె లేకుండా ఈ జీవితం కొనసాగించడం అసంభవం, అసాధ్యం. వెంటనే అమ్మని వెళ్లి నాంచారమ్మ గారితో

మాట్లాడమని చెప్పాలి. గబుక్కున లేచి మెట్ల వైపు వెళ్ళాడు. కానీ అడుగులు ముందుకి పడలేదు. అస్థిమితంగా పచార్లు చేయసాగాడు.

అతని కళ్ళ ముందు పవిత్ర, శివలే కదులుతున్నారు.

పవిత్ర డాక్టర్ అందగాడు కాబట్టి, డాక్టర్ అనే హోదా ఉంది కాబట్టి ప్రేమిస్తోందా? ఒక వ్యక్తిని ప్రేమించడానికి అర్హత అందమా? మనసుతో పనిలేదా? తను ప్రేమించినంత గాఢంగా ఆయన ఆమెని ప్రేమిస్తాడా? తను చూసుకున్నట్టు కళ్ళల్లో పెట్టుకుని చూసుకుంటాడా? ఆమెని పూలమీద నడిపించాలి అని తను కలలు కంటున్నాడు. ఆయనలా చేయగలడా?

ఇంతకీ పవిత్రని ఆయన నిజంగా ప్రేమిస్తున్నాడా? ఆయన  పవిత్రని ఎగరేసుకుపోతే తను జీవించడం ఎలా? తనంటే పవిత్రకు ఇష్టం లేదు. ద్వేషించడమే కాదు అసహ్యించుకుంటుంది కూడా. అయినా తనామెని ప్రేమించకుండా ఉండలేకపోతున్నాడు. కళ్ళు మూసినా, తెరిచినా ఆమె రూపం. ఆమె ఆలోచనలు... అసలు చదువు మీద ధ్యాస ఉండడం లేదు. తను అందగాడు కాదు కాబట్టి ఆమెని ప్రేమించకూడదు అని శాసించే అధికారం ఎవరికీ ఉంది? చదువు పూర్తి కాలేదు... ఆమె తనది అనే నిశ్చింత ఉంటే తనూ డాక్టర్ కావచ్చు. తనకి ఆస్తి ఉంది. అమాంతం సంపాదించాల్సిన అవసరమూ లేదు. ఇంక ఎందుకు తను ఆమెని వదులుకోవాలి?

పవిత్ర చిన్నపిల్ల. పై, పై మెరుగులు చూసి, ఆకర్షణలో పడడం సహజం. అలా అని ఆమెని వదిలేస్తాడా? అంత అందగాడు అయిన డాక్టర్ ని ఎందఱో అమ్మాయిలు ప్రేమిస్తారు. పవిత్ర మీద మోజు తీరాకో లేక మరో అమ్మాయి మీద మనసుపడో ఆయన పవిత్రని మోసం చేస్తే! తను ఆమెని ఎన్నటికీ మోసం చేయదు. పవిత్ర జీవితాంతం సుఖంగా, ఆనందంగా ఉండాలంటే తనే ఆమెని పెళ్లి చేసుకోవాలి. అవును చేసుకోవాలి.

ఎట్టి పరిస్థితిలోనూ  పవిత్రని వదులుకోవడం అసంభవం.

అసలు నాంచారమ్మగారికి పవిత్ర పెళ్లి కాకుండా శివని తరచూ కలుసుకుంటున్న విషయం తెలుసా? మాధవ గారికి తెలుసా? తెలిస్తే వాళ్ళు ఊరుకుంటారా? లేదు. వాళ్ళు అసలు ఊరుకోరు. తెలిసి ఉండదు.

వెంటనే తెలియాలి. అవును చెప్పాలి. పవిత్ర రోజూ కాలేజి నుంచి అతనితో కలిసి కారులో వెళ్తోందని చెప్పాలి. ఇది తన బాధ్యత.

మనసు ఎంత మంచిదైనా, మంచికీ, చెడుకీ మధ్య సమన్వయం  కుదరనప్పుడు ఆ మనసు విచక్షణా జ్ఞానం కోల్పోతుంది.

మోహన్ విచక్షణ నశించింది. స్వార్ధం రెక్కలు విప్పుకుంది. ఆ క్షణంలో అతను తీసుకున్న నిర్ణయం అటు పవిత్ర జీవితానికి, ఇటు మోహన్ జీవితానికి ఒక పెద్ద మలుపుగా మారుతుందని అతను ఊహించి ఉంటే ఎలా ఉండేదో! కానీ, మోహన్ ఊహించలేదు.

గబ,గబా మెట్లు దిగి పక్కింటి వైపు నడిచాడు. అయితే అప్పటికే ఆ ఇంట్లో ఒక్క గదిలో మాత్రమే లైటు వెలుగుతూ ఉండడం, ఆ గది పవిత్రది అని అతనికి తెలియడంతో ఒక్కసారి వెనక్కి తిరిగి హాలులో గుమ్మానికి ఎదురుగా ఉన్న గోడ గడియారం చూసాడు.

సమయం పది అయింది.

మానసిక సంఘర్షణలో సమయం తెలియలేదు. జీవితాంతం ఈ సంఘర్షణ ఇలాగే ఉంటే, సుదీర్ఘమైన సమయం గడిచేదెలా?

పవిత్రా నిన్ను వదులుకోను. ఎన్ని అవరోధాలు వచ్చినా నిన్ను నేనే పొందుతాను. ఈ ప్రపంచంలో మనసా, వాచానే కాదు నిస్వార్ధంగా ఆరాధిస్తూ, నీతో బతకాలని ఆశ పడేవాడిని నేనే ధృడంగా అనుకున్నాడు.

మోహన్ అలా అనుకోడంలో తప్పులేదు. ఆ వయసు, అతని గాఢమైన వాంచా అలా అనుకోమనే చెబుతున్నాయి.

విచక్షణ, వివేకం నిలకడలేనివి. మోహాలకు, వాంఛలకు లొంగిపోవడం వాటి లక్షణం.

అవే జీవితాలను తారుమారుచేసి బంధాలను బలహీనపరుస్తాయి. ఇంకా చెప్పాలంటే మనుషులను దూరం చేస్తాయి.

తన ఆవేదన, పవిత్ర పట్ల ఉన్న ప్రేమ అనురాగం తల్లికి తెలియచేసి, ఆ ప్రేమానురాగాలను ఒక పాశంతో బంధించాలన్న ఆశతో ఆవిడని పెళ్లి రాయబారానికి పంపించాలన్న అతని కోరిక కార్యరూపం దాల్చి ఉంటే ఏం జరిగేదో తెలియదు. కానీ ఇప్పుడు మోహన్ తీసుకున్న నిర్ణయం మాత్రం అతన్ని, అతని జీవితాన్ని కొన్ని గంటల్లో తారుమారు చేయబోతున్నాయి.

రాత్రి అయినా, అందరూ పడుకున్నా గట్టిగా అరిచి అందరినీ లేపి తన మనసులో ఉన్నది అరిచి చెప్పాలనిపిస్తుంటే, అచేతనంగా గుమ్మంలో నిలబడిపోయిన కొడుకు వైపు విచిత్రంగా చూసింది చాముండేశ్వరి.

"ఏంటి నాన్నా? ఎక్కడికి వెళ్లి వస్తున్నావు? భోజనానికి రాలేదేమిటి అని కంగారు పడుతున్నాను." అంది.

"అమ్మా ఇప్పుడే, ఈ క్షణమే వెళ్లి పవిత్రని నాకు ఇవ్వమని, ఇది నిబంధన అని గట్టిగా వాళ్లకి చెప్పిరా" అనాలనుకున్న అతని మాటలు గొంతులో ఆగిపోయాయి. స్వరం దుఃఖపు తెరలు పేరుకుని ఘనీభవించింది.

కళ్ళల్లో సుడులు తిరుగుతున్న నీరు ఆవిడకి కనిపించకుండా తల వంచుకుని తన గదివైపు నడుస్తూ "నాకాకలి లేదమ్మా. పడుకుంటాను" అని చెప్పి, వేగంగా మెట్లు ఎక్కాడు.

ఆవిడ అయోమయంగా, అతని వాలకం చూస్తూ "భగవంతుడా నా కొడుకు ఏమై పోతున్నాడు? వీడిని కాపాడు తండ్రీ!" అని వేడుకుంటూ స్థాణువులా నిలబడిపోయింది.

ఒక పాశం అతన్ని పతనం వైపు లాగుతోంటే, మరో పాశం అతన్ని రక్షించుకోడానికి ఆరాటపడుతోంది.

ఎవరికి దక్కుతాడు మోహన్? తల్లికా? పవిత్రకా? కాలానికి వదిలేస్తూ నిశ్శబ్దంగా ఉండిపోయింది ప్రకృతి.

మనసా! ఎందుకిన్ని విన్యాసాలు చేయిస్తావు మనిషితో. నిన్ను మర్కటం అన్నందుకేనా!

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS